# అపర్ణ

## కన్నెపల్లి గోపాలకృష్ణ

పెద్దగా కూతకూసి, బద్ధకంగా ఆగింది లింక్ ఎక్స్‌ప్రెస్ వాల్తేరు స్టేషన్‌లో

రాత్రి పదకొండు గంటలవేళ –

మాఘమాసమైనా చలి ఎక్కువగానే ఉంది

ట్రైనునుంచి దిగేవాళ్లతో కోలాహలంగా ఉంది ప్లాట్‌ఫారమ్ ప్లాట్‌ఫారం పైన కాలు మోపుతుంటే కళ్లల్లో నీళ్ళు గిర్రున తిరిగాయి నాకు

చల్లటి గాలి ఏదో కబురు చెప్తున్నట్లు నన్ను తాకుతూ పోతోంది

నేను నిలబడ్డ భూమిలోంచి నాలోకి ఏదో విద్యుత్తు ప్రవహిస్తున్న భావన

శరీరమంతా చిత్రమైన అనుకంపన

ఎన్నాళ్ళకు నా భూమి, నాగాలి, నా భాష

పుట్టి పెరిగిన ఊరిలో ఉద్యోగం, అక్కడే జీవన పోరాటం, అక్కడే కాలం చెల్లిపోవడం చాలా తక్కువ మందికేకదా ఈ భాగ్యం

జన్మస్థలం మాట దేవు డెరుగు కనీసం స్వంత రాష్ట్రంలో మారుమూల ప్రాంతంలోనైనా ఉండ నివ్వలేదు నా దౌర్భాగ్యం

తెలుగు గాలిని పీలుస్తూ, తెలుగుభాష మాట్లాడుతూ, తెలుగు తిండి తింటూ ఓహ్! ఎంత చక్కటి భావన

పొట్ట గురించి అన్నిటికీ దూరమవ వలసి వచ్చింది

పదమూడేళ్ళుగా పరాయి రాష్ట్రంలో పని చేస్తున్నా మనసులో తెలుగుస్థానం లేశమైనా తరుగ లేదు

ఎంతసేపు ఆంధ్రా తలంపులే

అటువంటిది ఇంతకాలం ఆంధ్రా రాకుండా ఎలా ఉన్నానో?

ఆలోచిస్తూ ఎన్ని నిముషాలు నిలబడ్డానో మరి . నా భుజంపై మెత్తగా అపర్ణ చేయి

భావనలలోంచి వాస్తవంలోకి వచ్చాను

కళ్ళు మసకబారినట్లుంటే రుమాలుతో తుడుచుకున్నాను రుమాలు నిండా తడి

ఏడుస్తున్నానా??

బాధ పడుతున్నారా?" మెల్లగా అడిగింది అపర్ణ

బాధా అబ్బే ఎందుకూ? నా మాటల్లో ఎంత దాచుకుందామనుకున్నా దాగని తడబాటు

ఆమె ఏమీ మాట్లాడలేదు

నా కుడిచేతిని తన చేతిలోకి తీసుకొని గట్టిగా పట్టుకుంది

నాలో ఏ మూలో దాగి ఉన్న దైన్యం పటాపంచలయ్యింది

అవునూ? నేనెందుకు బాధపడాలి? ఏం కాని పని చేసానని? నా అపర్ణ పక్కగా ఉండగా నాకేం కొరత?

'ఎంతసేపు నాన్నా ఇక్కడ? బయటికి పోదాం' నా ఎనిమిదేళ్ల కొడుకు విసుక్కొంటున్నాడు

పోర్టరుకి సామానులు ఎత్తి బయటికి నడిచాను

గేటులో టిక్కెట్టిస్తూ టిక్కట్టు కలక్టర్‌ని అడిగాను – దగ్గరలో ఏదైనా మంచి లాడ్జి కట్టారా అని

దొండపర్తి జంక్షన్‌లో కొత్తగా మంచి హోటల్ కట్టారని చెప్పాడతను

ఆటో లో ఎక్కాం ముగ్గురమూ

ఆటోవాడు మూడు నిముషాలలో దూరాన్ని మింగేసాడు

ఆ మూడు నిముషాలూ ఆతృతగా పరికించాను సిటీని ఎంత మారింది ఊరు!

రైల్వేస్టేషనునుంచి దొండపర్తి జంక్షన్ వరకూ కేవలం రైల్వే క్వార్టర్లే ఉండేవి పూర్వం రాత్రి పది గంటల తరువాత పెద్ద జన సంచారమూ ఉండేది కాదు

ఇప్పుడో?

అటూ ఇటూ రెండు వైపులా అధునాతన భవంతులు

అంతరాత్రైనా రోడ్ల నిండుగా జనం

చక్కటి సిమ్మెంటు రోడ్లు

ఉక్కు కర్మాగారం ఇంతమార్చిందా పట్నాన్ని!!

పదేళ్ల కాల వ్యవధిలో ఇంతగా ఎదుగుతుందా ఊరు!?

రూములో దిగి స్నానం చేసి ఫ్రెష్ అయినంత వరకూ నాతో ఏమీ మాట్లాడలేదు అపర్ణ

మా కుమార రత్నం వచ్చీ రాగానే పక్కపై పడ్డాడు

స్నానంచేసి వచ్చి నా ఎదురుగా కూర్చుంది అపర్ణ

భోంచేద్దామా? అడిగాను

వమ్మ ఆకలిగా లేదు మీరు చేయండి సూట్ కేసులోంచి దుప్పట్లు బయటకు తీస్తూ చెప్పింది అపర్ణ

నాకూ ఆకలిలేదు పాలు తీసుకొందాం బెల్ నొక్కి రూమ్‌బాయ్‌తో చెప్పాను పాలు తసుకు రమ్మని

పాలు తాగిన తరువాత మంచం పైన పడు కొన్నాను ఆలోచిస్తూ

బాబుని సరిగ్గా సర్ది, లైటు ఆర్పి నడుం వాల్చింది అపర్ణ

ఏవో అర్థం పర్థంలేని ఆలోచనలు నాలో

తేట తేట తెలుగులా, తెల్లవారి వెలుగులా

కలసి పాడుదాం తెలుగుపాటా

పాడనా తెలుగుపాట

ఇలా ఎన్నో పాటలు చెవుల్లో గింగురు మంటున్నాయి

మనసునిండా ఉద్వేగం

ఇంకా నిద్రపోలేదా? నా నుదిటిపైన అపర్ణ చల్లటి చేయి

నిద్ర రావడంలేదు పర్ణా ఆమె గాజులు సవరిస్తూ చెప్పాను

ఆలోచనలు మాని ప్రశాంతంగా నిదురపొండి మళ్లీ రేపు ఉదయమేకద ప్రయాణం నా జుత్తు సర్దుతూ చెప్పింది అపర్ణ

రేపే అసలైన ప్రయాణం

నా వాళ్లని, నా రక్తాన్ని కలుసుకో బోతున్నది రేపే!

నా తోడ బుట్టిన వాళ్లను, నా బంధుబలగాన్ని తిరిగి ఎంత కాలపు వియోగం తర్వాత కలుసుకో బోతున్నాను!

వాళ్ళు నన్ను చూసి ఎలా స్పందిస్తారో?

ఇద్దరన్నయ్యలూ ఎలా ఉన్నారో?

వదినల ఆరోగ్యం ఎలా ఉందో?

పిల్లల్ని గుర్తించ గలనో? లేదో?

నా మెదడులో జోరీగల్లా ఆలోచనలు

జోకొడుతున్నట్లు అపర్ణ చేయి నెమ్మదిగా నా తలను నిమురుతోంది

మెల్లగా నిద్రలోకి జారిపోసాగాను

కళ్ళు మూసుకుంటే దట్టమైన చీకటి తెరలు

ఆ తెరలపై రంగుల నా జీవితపు వెలుగులు

ఆ వెలుగుల జిలుగులలో ఎంతోమంది పాత్రధారులు

బాల్యందాటి, యవ్వనాన్ని సంతరించుకొని, తల్లిదండ్రులను కోల్పోయి, డిగ్రీ పూర్తిచేసిన నేను

చిన్నప్పటి నుంచీ నన్నెంతో ప్రేమగా చూసిన పెద్దక్కా, ఇద్దరన్నయ్యలూ, వదినలూ!

నేనంటే ప్రాణమిస్తూ, తీపి తీపి స్నేహాన్ని అందించిన స్నేహితులూ!!


నా గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన కొత్తలో సరదాగా

వెళ్లిన ఓ కాంపిటేటివ్ ఎగ్జామ్‌లో ఉత్తీర్ణుని కావడం, ఇంటర్వ్యూ జరగడం, ఆ తర్వాత అపాయింట్‌మెంట్ రావడం నా జీవనగతినే పూర్తిగా మార్చేసింది.

నాగపూర్‌లో ఉద్యోగమనగానే హతాశుణ్ణయ్యాను.

ఎక్కడి మా వూరు? ఎక్కడి నాగపూరు??

నా వాళ్లకి, నా భాషకి, నా గడ్డకి దూరమవుతూ ఎక్కడో పరాయి రాష్ట్రంలో...పొట్ట కూటికోసం... ఊహూ.




వెళ్లడానికి నా మనసు ససేమిరా అంగీకరించలేదు.

కానీ అప్తులందరూ పోరారు. చెవి నిల్లు గట్టుకుని మరీ చెప్పారు.

ఈ రోజుల్లో ఉద్యోగాలు దొరకడమే దుర్లభమనీ, అందునా ఓ మంచి సంస్థలో మరింత కష్టమనీ...

మరీ అంతగా కాదనుకొంటే మధ్యలో వచ్చెయ్యమన్నారు.

కొద్దిగా సర్వీస్ చేసిన తరువాత ట్రాన్స్ఫర్ చేయించుకొని ఆంధ్రాకి వచ్చెయ్యవచ్చు నన్నారు.

ఎందరో ఎన్నో విధాల చెప్పిన పిమ్మట నేను కూడా దీర్ఘాలోచనలో పడ్డాను.

వీళ్లందరూ చెప్పినట్లు ప్రస్తుత పరిస్థితులో ఉద్యోగాలు ఆకాశపుష్పాలే.

వచ్చిన అవకాశాన్ని ఎందుకు కాలదన్నుకోవాలి?

ఇష్టం లేకపోతే అప్పుడే మానెయ్యవచ్చు.

ఈ లోపల మరో పరీక్ష పాసైతే, ఆంధ్రాకే తిరిగి రావచ్చు.

మాతృభాషాభిమానం కూడు పెట్టదు కదా!

"గాలిలో ఉన్న రెండు పిట్టల కంటే చేతిలో ఉన్న ఒక పిట్టే విలువైనది" ఈ ఆంగ్ల సూక్తిని మననం చేసుకొంటూ వాల్తేరులో అర్ధ రాత్రి పూట భారా హృదయంతో బండి ఎక్కాను నా వాళ్లకి వీడ్కోలు చెప్తూ.

భాష రాక ముందులో ఇబ్బందులు పడ్డా నెమ్మదిగా అలవాటు పడటం నేర్చుకొన్నాను. రెండు నెలలకోసారైనా ఆంధ్రా వెళ్లనిదే తోచేదికాదు.

జీతాన్నంతా ప్రయాణాలకే తగుల వేస్తున్నానని ఇంట్లో వాళ్ల చివాట్లు పెట్టడంతో మెల్ల మెల్లగా ఆంధ్రాకి వెళ్లడం తగ్గించాను.

*  *  *

నాకు క్రికెట్ అంటే విపరీతమైన పిచ్చి.

ఆడటంలో కన్నా కామెంటరీ వినడంలోనే మజా వచ్చేది.

దగ్గరలోనే తెలిసిన ఒకాయన ఇంట్లో టీవి ఉండేది. సెలవు దినాల్లో వాళ్ల ఆహ్వానంపై అక్కడికి వెళ్లి వచ్చే వాడిని.

ఆ సమయంలో పరిచయమయ్యింది అపర్ణ.

క్రికెట్‌లో ఆమెకున్న పరిజ్ఞానానికి విస్తుపోయే వాడిని నేను.

బ్యాట్స్‌మన్‌లలో ఎవరి బ్యాటింగు బాగుంటుందో, ఎవరెవరు ఏవి రికార్డులు నెల కొల్పారో, ఎటువంటి బౌలింగుకు అవతలివాడు తెలియక పడిపోతాడో ఆమె చెప్తుంటే విన ముచ్చటగా ఉండేది నాకు.

మా సంభాషణ సాధారణంగా ఇంగ్లీషులోనే జరిగేది.

చక్కటి ఆంగ్ల ఉచ్చారణ ఆమెది.

అప్పుడప్పుడు ఆమె ఏవేవో ఇంగ్లీషు నవలలు తెచ్చి చదవమని ఇచ్చేది. పరభాషా సాహిత్యంపై మోజులేని నేను మొహమాటానికి అందుకొనే వాడిని కాదు.

ఆమె ఎప్పుడైనా ఆ నవలలపై చర్చించ బోతే తెల్ల ముఖం వేసేవాడిని.

ఆమె ముసి ముసిగా నవ్వుతుంటే ఒంటికి కారం రాసుకొన్నట్లు ఉండేది. పట్టుదలతో ఆంగ్ల సాహిత్యాన్ని చదవడం ప్రారంభించాను.

మెల్ల మెల్లగా మా పరిచయం వృద్ధికాజొచ్చింది.

సాయంత్రాలు ఏ పేపరో, పుస్తకమో పట్టుకొని దగ్గరగా ఉన్న పార్కులోకి పోయేవాడిని నేను.

ఆమెకూడా అప్పుడప్పుడు పార్కుకొచ్చేది.

ఆమె సమక్షంలో కాలమే తెలిసేది కాదు.

ఇలా మా పరిచయానికి ఓ ఏడాది వయసు దాటింది.

రెండు రోజులు ఆమెని చూడక పోతే ఏమీ తోచేదికాదు.

ఏ పని చేస్తున్నా ఆమె పేరే మనసులోన!

ఎన్ని కాగితాలపై ఆమె పేరు లిఖించానో!!

దీన్నేమంటారు?

ప్రేమా?? ఏమో!!!

ఈ మధ్యలో పెళ్లి చూపుల కోసమని ఇంటికి వెళ్లడం, ఇద్దరమ్మాయిలని చూడడం జరిగింది. వాళ్లని పోల్చి సరి చూసుకొంటే ఏదో అసంతృప్తి మిగిలేది నాలో.

కాలం గడుస్తోంది

ఈ లోపల బదిలీల గురించి నేను అప్లికేషన్లు పెట్టడమూ, అవి వెనక్కి తిరిగి రావడమూ జరిగింది

ఏ పని చేయాలన్నా నిరాసక్తత

అపర్ణతో మాట్లాడాలంటే అదో విధమైన బెరుకు

నే నెంతగా అపర్ణ నుంచి తప్పించుకు పారిపోవాలని ప్రయత్నించే వాడినో ఆమె అంతగా దగ్గరయ్యేది

నా మనసులో అణచుకొందామన్నా అణగని అలజడి ఆమె సుముఖంలో ఈ భావాలు నా ముఖంలో ప్రస్ఫుటిత మవుతున్నాయా? ఆమె ఇవన్నీ గుర్తించి కూడా గుర్తించనట్లు నటిస్తోందో? ఏమో?

సెప్టెంబరు చివరి రోజులు

వర్షాకాలపు ముగింపుకు, చలికాలపు ప్రారంభానికి సంధి రోజులు ..

పార్కులో ఓ మూల కూర్చుని, ఏదో ఆలోచిస్తున్నాను

"ఏమిటో అంత దీర్ఘాలోచన?" నా కళ్లల్లోకి చూస్తూ ఇంగ్లీషులో అడిగింది అపర్ణ. ఎప్పుడొచ్చి నా పక్కన కూర్చుందో. ఏమో?

అమెని చూస్తుంటే తిరిగి అదే కలవరం మదిలో

"ఈ మధ్య ఏమిటో చాలా పరాకుగా ఉంటున్నారు మీరు బాధలు స్నేహితులతోనూ, ఆనందాన్ని చుట్టాలతోనూ పంచుకోవాలంటారు నాతో కూడా చెప్ప రానిదా విషయం?" లాలనగా అడిగిందామె

ఆమె ఆప్యాయతకు మతి పోతోంది

ఇక భరించలేను

ఒక్క ఉదుటున ఆమె చేయి నా చేతుల్లోకి తీసుకుని ఆవేశంగా చెప్పాను "ఐ లవ్యూ వర్ణా"

ఆమె ముఖం సంతోషంతో మెరిసింది

ఐటూ" మృదువుగా చెప్పింది చేతులు విడిపించుకొంటూ 'ఈ మాట చెప్పడానికా ఇంత మధన పడ్డారు" నవ్వింది

ఒకరి మనసులు ఒకరికి విప్పి చెప్పుకొన్నాం

# అపర్ణ

మా పెళ్లి ముహూర్తం మేమే నిశ్చయించుకొన్నాము

ఇలా అపర్ణని పెళ్లి చేసుకుంటున్నానని మా వాళ్లకి తెలియ జేయడం,వాళ్లొచ్చి మండి పడటమూ జరిగింది ఎన్నో విధాల నచ్చచెప్ప చూసారు కానీ నా పట్టుదల సడలలేదు అపర్ణ వాళ్ల ఇంట్లో కూడా అపర్ణకు తీవ్ర ప్రతిఘటన ఎదురయ్యింది

మేమిద్దరం ఓ మంచి రోజు చూసుకుని రిజిస్ట్రార్ ఆఫీసులో గప్‌చిప్‌గాపెళ్లి చేసుకొన్నాం

మా ఆఫీసులోనూ, లొకాలిటీలోనూ ఈ విషయాన్ని కొన్నాళ్ళు విచిత్రంగా చెప్పుకొన్నారు కానీ ఆ తర్వాత పాతబడి ఊరుకున్నారు

మా ప్రేమ ఫలానికి నిదర్శనంగా రెండేళ్లలో చక్కటి బాబు

*   *   *

పెళ్లయిన ఏడాది తరువాత ఇంటికి వెళ్దామని బుద్ధి పుట్టింది

మా వాళ్ళు హృదయ పూర్వకంగా ఆహ్వానిస్తారనే అనిపించింది నేను వాళ్ల ప్రమేయం లేకుండా పరాయి రాష్ట్రపు అమ్మాయిని పెళ్లి చేసుకోవడం వలన వాళ్లకి కినుక రావడం సహజం కాలం అన్ని గాయాలనూ మాన్పినట్లే వాళ్ల మనసులనీ సమాధాన పరచకపోలేదు

నా ప్రపోజల్‌ని అపర్ణ కూడా సంతోషంగా ఆమోదించింది

నా వాళ్లని ఎన్నడూ చూడక పోయినా వాళ్ల గురించి అంతా తెలుసు ఆమెకు తీరిక దొరికినప్పుడల్లా నా బాల్యం గురించి, చుట్టుపక్కాల గురించి, నా కాలేజీ రోజుల గురించి అడిగి శ్రద్ధగా వినేది

ఆఫీసుకు పదిహేను రోజుల సెలవు పెట్టి ఇద్దరమూ పెద్దన్న ఇంటికి చేరుకున్నాము మా వాళ్లందరూ మా చిన్ని కొడుకు పెళ్లికి వెళ్లినట్లు తెలిసింది

మరీ సంతోష మనిపించింది నాకు

ఎంత అదృష్టం

ఒకే సమయంలో అందరినీ కలియడమే కాక,అపర్ణని కూడా అందరికీ చూపి నా ఎంపికకు మన్ననలందుకోవచ్చు

మన భాష చదవకపోతేనేమి గాక, ఆ అణకువా, కలగొలుపుతనమూ మా వాళ్లని సంతృప్తి పరచదూ!

కానీ

నా ఊహలకు భిన్నంగా–

ఎంతో సరదాగా వెళ్లిన మాకు తీవ్ర నిర్లక్ష్యమే ఎదురయ్యింది

నా వాళ్లందరూ నన్ను ముందు నిష్ఠూరాలాడినా ఆప్యాయతాభి మానాలతో ముంచెత్తారు

అపర్ణని ఎవ్వరూ పట్టించుకోలేదు ప్రతి ఒక్కరూ ఆమెని చూసి ఇంకొకరితో గుస గుసలు పోయేవారే వదినలు కూడా అపర్ణతో మాట్లాడలేదు

అదీగాక భాషకూడా పెద్ద ప్రతిబంధకమాయె


అపర్ణకా తెలుగురాదు వాళ్లకా ఇంగ్లీషు అంతగా రాదు


ఈ పరిస్థితి అపర్ణకెలా ఉన్నా నాకు మాత్రం మహా దుర్భరంగా ఉంది ఒక వంక నన్ను వాళ్లలో కలుపుకొంటూ ఆమెని ఆమడ దూరంలో ఉంచడం ఎలా సహించ గలదు నా మనస్సు?

ఆమె ఏ పనిలో కల్పించుకో బోయినా ఏదో వంక చెప్పి వారించేవాళ్లు

ఎవరూ మాట్లాడక ఏమీ తోచక నలుగురిలోనూ ఉన్న నాతో కల్పించుకొని మాట్లాడలేక బిక్కు బిక్కుమంటూ ఓ మూల కూర్చునివున్న ఆమెని చూస్తే మనసు తరుక్కు పోయింది

పెళ్లయిన వెంటనే బయలుదేరి పోయాను మా వాళ్లెంత వారిస్తున్నా వినకుండా మరో నాలుగు



# వసంతంలో శిశిరం

ఇంటి ముందున్న రావిచెట్టు
ఏటేటా శిశిరంలో పూర్తిగా
ఆకు రాల్చడం, వసంతం రాగానే
అందమైన చిగురు పెట్టడం పరిపాటి.

క్రోధన క్రోధానలో ష్మానికి
బాధా తప్త దళిత పత్రాలు
వసంతంలో కూడా రోదిస్తూ
పస చెడ రాలుతూనే ఉన్నాయి.
కాల గమనాని కంతరాయం
కలిగిస్తున్నాడా మనిషి?

★ ★ ★

తను సృజించిన రేడియో ధార్మికత
అనుక్షణ విస్ఫోటంతో
వాతావరణ రచనను
పరి పరి విధాల మారుస్తూంటే;
పరిశ్రమల కాలుష్యం
పరిణామ క్రమాన్ని శతధా
వక్రింప చేస్తూంటే;
అడవులు పడగొట్టి
అనాదిగా ప్రకృతిలో సాగే
జీవ వృక్ష పారస్పర్యాన్ని
చెడ గొట్టి, జీవాను కూల్యతకు
కడగండ్లు కలిగిస్తూంటే;
రసాయన ఎరువులతో
కసాయి వాని వలె
భూమాత కడుపులో
ప్రొద్దల్లా చిచ్చు పెడుతూంటే;
వసంతంలో శిశిరం రాదా?

★ ★ ★

కాలచక్ర పరిభ్రమణ వేగం
ప్రాలుమాలి మందగిస్తూంది,
వసంతో దయం ఆలస్యమై,
వసంత సమయంలో శిశిర మనిపించినా
శిశిరాన్ని తరిమే వసంతం
శశి కాంతులతో
పసిడి పూతలతో
కోయిల పాటలతో
మత్తుగా మైమరపిస్తూ
వస్తుంది,
ఉగాది పచ్చడి తినిపిస్తుంది.

వసంతరావు వేంకటరావు

# అపర్ణ

రోజులుందామని అపర్ణ బ్రతిమాలినా వినలేదు నేను

నాగపూర్ చేరిన దాది అపర్ణ పట్టుపట్టి త్వరంగా తెలుగు నేర్చుకోవడం ప్రారంభించింది

నేను ఎంతో బలవంతం చేయగా కారణం చెప్పింది– తనకు తెలుగు భాష రాకపోవడం వలన అందరితో కలివిడిగా ఉండలేక పోయానని. తనతో మాట్లాడడానికి ప్రతి ఒక్కరూ ఇబ్బంది పడ్డారని. అదీగాక భర్త తెలుగువాడైనందు వలన తెలుగు ఇల్లాలుగా మారడం తన ధర్మమనీ, తెలుగు భాష నేర్చుకోవడం తన కర్తవ్యమనీ!

రెండు నెలలలో చందమామ చదవడం వరకూ వచ్చింది ఆమె చదువు

మరి కొద్ది నెలలలో నే తెలుగు భాషలో ప్రావీణ్యత సంపాదించింది అపర్ణ

నేను వ్రాసే కథలను శ్రద్ధగా ఫెయిర్ చెయ్యడమే గాక వాటిపై చక్కటి విమర్శలు చేసేది నాతో తెలుగులో తప్ప మరో భాషలో మాట్లాడేది కాదు తెలుగు పండుగలూ, ఆచారాలు తూచ తప్పక పాటిస్తుంది ఇన్ని మాట లెందుకు? నూటికి నూరుపాళ్ళు తెలుగు వనితగా మారిపోయింది అపర్ణ

నా అన్నలు ఉత్తరాలు వ్రాస్తూనే ఉన్నారు నేనూ సమా ధానాలిస్తూనే ఉన్నాను ఈ పదేళ్లలో వాళ్లెన్నో సార్లు ఆహ్వానించారు ఇంటికి రమ్మంటూ మళ్లీ ఏ అవమానా లెదుర్కోవలసి వస్తుందో అని నేనే వెళ్లలేదు

కూతురి పెళ్లికి తప్పక రమ్మంటూ బ్రతిమాలుతూ ఉత్తరం వ్రాసాడు పెద్దన్న శుభలేఖ పంపుతూ

నేను సంశయించినా బంధుత్వాలు తెంపుకోరాదనే అపర్ణ బలవంతం పైన తప్పని సరిగా బయలు దేరవలసి వచ్చింది

నాతో పాటు తనూ బయలుదేరింది నా వాళ్ళు ఆమెని మళ్లీ పూర్వంలా చులకనగా చూస్తే భరించ గలనా??

* * *

శ్రీకాకుళంలో బస్సు దిగిన తరువాత ఎందుకైనా మంచిదనే ఉద్దేశంతో నేరుగా ఇంటికి పోకలాడ్జిలో రూము తీసుకున్నాను

స్నాన పానాదులు పూర్తి చేసుకుని బయలు దేరాం నేనూ, అపర్ణా, బాబూ

పెళ్లి పందిరికి దగ్గరవుతున్న కొద్దీ టెన్షన్ పెరిగి పోసాగింది

మమ్మల్ని మా వాళ్ళు ఎలా రిసీవ్ చేసుకొంటారో?

పూర్వంలా వెలివేసినట్లుగానే చూస్తారా? లేక వాళ్లలో కలుపుకొంటారా?

లోపలికి వెళ్లాం

పెళ్లి మర్నాడు జరగనున్నందు వలనేమో అసలైన సందడి ఇంకా మొదలు కాలేదు

వసారాలో కుర్చీలలో కూర్చుని కొంత మంది బాతాఖానీ వేస్తున్నారు

నన్ను చూడగానే ఒక్క ఉదుటున లేచి, కౌగ లించుకున్నాడు అన్నయ్య

ఇన్నాళ్లకు గుర్తు కొచ్చామా మేం?' నిష్ఠూర మాడాడు

నా వెనుక మవునంగా అపర్ణ దిక్కులు చూస్తూ బాబు

అన్నయ్యతో ఏదో పనిపడి కాబోలు వదిన వచ్చింది

"వదినా" పలకరించాను

"బాగున్నావయ్యా? ఎన్నాళ్లకు ఆనందంగా వదిన

నా కొడుకుని దగ్గరకు తీసుకొని ముద్దు పెట్టు కొంది

ఇంతలో మిగిలిన రక్త సంబంధీకులందరూ వచ్చి చేరారు.

అక్కా, బావ, పిన్ని, మామ, బాబాయి, పిల్లలూ

అందరూ నా చుట్టూ చేరి ప్రశ్నల వర్షం కురిపించే వాళ్లే.

ఒక్కరు కూడా నిరాదరణగా మాట్లాడలేదు

లాడ్జిలో దిగానని చెప్తే బాధ పడ్డారందరూ చివాట్లు పెట్టారు

కబుర్లలో గంటసేపు ఇట్టే గడిచి పోయింది ఎన్ని కబుర్లు చెప్పుకున్నా ఇంకా చెప్పవలసినవెన్నో మిగిలి పోతున్నాయి

హఠాత్తుగా గుర్తుకొచ్చింది అపర్ణ

అరే, వీళ్లని చూసిన ఆనందంలో తనని మరచిపోయానని. నేను నిర్లక్ష్యం చేసానని బాధ పడదు కద పూర్వంలాగే వీళ్ల అనాదరణ వలన వాళ్లతో కలవలేక ఒంటరిగా కూర్చోలేదు కద

ఆమె కోసం చుట్టూ వెతికినాయి నా కళ్ళు

ఇంతలో మా వాడు లోపల నుంచి వచ్చాడు లడ్డూ తింటూ

నానా, దొడ్డమ్మలు రమ్మంటున్నారు చెప్పేసి తోటి పిల్లలతో ఆడుకోడానికి వెళ్లి పోయాడు

లోన గదిలోకి వెళ్లాను

ఏమూలో కుర్చీలో బెరుకుగా కూర్చుంటుం దనుకున్న అపర్ణ మా వదినల పక్కన కూరలు తరుగుతూ– ఏవో కబుర్లు చెప్పుకుంటూ నవ్వేసు కుంటున్నారు తోడికోళ్లు

నేనూ చాపపై చతికలబడ్డాను

ఏమయ్యా మరిదీ! ఇన్నాళ్ళూ మా చెల్లిలిని చూపకుండానే దాచేస్తావా? నా ముందు ఫలహారం పెడుతూ అడిగింది చిన్న వదిన

మాటల్లో పడ్డాం అందరమూ

నా చిన్నతనం గురించి, నా ఇష్టాల గురించి, నా కపల గురించి సాగిపోతున్నాయి కబుర్లు

ఎన్నో ఏళ్ల నుంచి పరిచయం ఉన్న దానిలా వాళ్లలో కలిసి పోయి వదినలతో పాటు అప్పుడప్పుడూ నామీద విసుర్లు విసురుతూ అపర్ణ-

ఆనందంతో కళ్ళు చెమ్మగిల్లాయి మరోసారి

*　　*　　*　　*

వాలు కుర్చీలో విశ్రాంతిగా చేరగిలబడి పేపరు చూస్తున్నాను

పెళ్లి నుంచి పది రోజుల క్రిందటే వచ్చాం మేము

ఆ జ్ఞాపకాలు ఇంకా మరుగున పడలేదు

నాకో టీ కప్పు అందించి తనూ ఓ టీ కప్పుతో పక్కనే కుర్చీలో కూర్చుంది అపర్ణ

సంధ్యాకాంతిలో మెరిసిపోతున్న ఆమె ముఖం చూస్తుంటే తమకం ఆవరించింది నన్ను ఆమె చేయి పట్టుకొని దగ్గరకు తీసుకున్నాను నున్నటి మెడపై నా అధరాలు ప్రాకుతుంటే గుర్తొచ్చింది ఎర్రరాళ్ల నెక్లెస్

అవునూ ఈమధ్య నెక్లెస్ పెట్టుకోవడం మానేసావేం? మంగళ సూత్రంతో ఆడుకొంటూ అడిగాను

కొద్దిగా దూరం జరిగి, నేల చూపులు చూస్తూ చెప్పింది అపర్ణ

చెప్పడమే మరచి పోయాను ఆ రోజు ముహూర్తం వేళకి విపరీతమైన తలపోటుతో పై గదిలో పడుకున్నారు మీరు సరిగ్గా కన్యాదానం సమయానికి నెక్లెస్ కావాలని పేచీ పెట్టాడు పెళ్లి కొడుకు తండ్రి వాళ్ల ముందే చెప్పారట కానీ సొమ్ము సర్దుబాటు కాక కొనలేదు బావగారు సర్ది చెప్పవచ్చులే అన్న ఉద్దేశంతో ఉన్నారాయన ఆయన ఎంతో బ్రతిమాలినా వినలేదు మగ పెళ్లి వారు నెక్లెస్ అప్పటి కప్పుడే కావాలని, లేకపోతే దాని బదులు ఓ అయిదువేలన్నా కావాలని మంకుపట్టు పట్టాడాయన ఎంతమంది పెద్దలు చెప్పినా వినిపించుకోలేదు పంతాలు, పట్టుదలు పెరిగి పోసాయి పెళ్లి ఆగిపోయే ప్రమాదం ఎర్పడింది ఓ ఆడ పిల్ల జీవితం- అందునా మన అమ్మాయి జీవితం నా దగ్గరున్న నెక్లెస్‌ను ఎప్పుడో తప్ప వాడడం లేదుకదా నేను అది నా దగ్గర నిరుపయోగంగా పడి ఉండడం కన్నా ఓ ఆడపిల్ల జీవితాన్ని నిలబెట్ట గలిగితే అంతకన్నా కావలసిన దేమున్నది? మరేమీ ఆలోచించలేదు నేను నెక్లెస్ బావగారి చేతిలో పెట్టాను. దాన్ని తీసుకోడానికి ఆయన ఓ పట్టాన ఒప్పుకోలేదు మమ్మల్ని ఇంకా వేరుగా చూస్తున్నారా అని నిష్ఠురమాడితే తప్పని సరిగా తీసుకున్నారు ఆ నెక్లెస్ పట్టుకొని కళ కళలాడుతున్న ముఖంతో నావైపెలా చూసిందో తెలుసా సీత? అబ్బ ఇప్పటికి ఆ చూపు మరచి పోలేను"

కొన్ని క్షణాలు తరువాత మెల్లగా నావద్ద కొచ్చింది అపర్ణ

భుజంపై చేయేస్తూ అంది "మిమ్మల్ని అడక్కుండా చేసినందుకు కోప మొచ్చిందా? క్షమించరూ" బేలగా అంది

ఆ ఎర్ర రాళ్ల నెక్లెస అంటే అపర్ణకు ఎంత ప్రాణమో నాకు తెలుసు ఆమె తల్లి చనిపోతూ అపర్ణకు ఇచ్చిన చివరికానుకది ఓ సారి అవసరం పడి, ఆ నెక్లెస్ తాకట్టు పెడదామని అడిగితే నాతో తగవు వేసుకొంది గానీ నెక్లెస్ ఇవ్వలేదు జీవితంలో అదే మొదటిసారి, చివరిసారి కూడా ఆమె నాతో జగడమాడటం రోజూ సాయంత్రం ఓ గంటైనా ధరించనిదే తోచదామెకు

అటువంటి ప్రాణప్రదమైన నెక్లెస్‌ను ఓ ఆడ పిల్ల పెళ్లి నిలబెట్టే ఉద్దేశ్యంతో, అదీనా అన్న కూతురి కోసం త్యాగం చేసింది అపర్ణ.

ఇంతకు ముందు మావాళ్ళు చేసిన అవమానాన్ని కూడా పక్కకు నెట్టి, వాళ్ల కోసం ముందుకొచ్చి నిలబడింది అపర్ణ

మాతృభాష వదిలి, పరాయి భాష నేర్చి, నా మీద నమ్మకంతో ప్రేమతో నా కోసం తన సర్వస్వం ధారపోస్తూ నాలో కలిసి పోయిన నా అపర్ణా...

ఏ తప్పు చేసావని నిన్ను క్షమించగలను?

ఆర్తిగా హృదయానికి హత్తుకున్నాను ఆమెని □

# సుభాషితాలు

క్షణశః కణశశ్చైవ విద్యామర్థంచ సాధయేత్

క్షణత్యాగేకుతో విద్యా కణత్యాగేకుతో ధనమ్.




క్షణం వ్యర్థం చేయకుండా విద్యార్జన చేయాలి. కొద్ది కొద్దిగానే ధనాన్ని ప్రోగు చేయాలి. క్షణం వ్యర్థంగా గడిచినా విద్యార్జన నిలిచి పోయినట్లే. కొద్ది ధనమే గదా అని అలక్ష్యం చేస్తే ధనార్జన ఆగిపోయి నట్లే. (దీక్షతో చదవాలి, పూనికతో ధనాన్ని సంపాదించాలి అని భావము)

అజరామరవత్ ప్రాజ్ఞః
విద్యా మర్థం చ సాధయేత్.

గృహీత ఇవ కే శేషు
మృత్యు నా ధర్మ మాచరేత్.

ముసలితనం, మరణం మనకు లేదని తలచి విద్యార్జనను ధనార్జనను చేయాలి.




మృత్యువు చేతిలో తన జుత్తు చిక్కుకుందని తలచి వెంటనే ధర్మకార్యాన్ని చేయాలి.

(మనం శాశ్వతంగా వుంటామని తలచి విద్యార్జన ధనార్జన చేయాలి. మనలను యముడు లాక్కొని పోతున్నట్లు తలచి (రేపు ఉండముగాన) వెంటనే దాన ధర్మాలను చేయాలి అని భావము)

–ఆయుర్వేద శిరోమణి రాజరాజేశ్వరశర్మ